ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
సిద్దిపేట
గురువారం 20 నవంబరు 2025



చలి పంజా

న్యాల్‌కల్‌లో అత్యల్పంగా 9.5 డిగ్రీలు నమోదు

కోహీర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా చలి తీవ్రత తగ్గడం లేదు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కు వగానే నమోదవుతున్నాయి. దీంతో ఉమ్మ డి మెదక్ జిల్లా వణుకుతూనే ఉంది. బుధవారం ఉమ్మడి జిల్లాలో ఐదు ప్రాంతాల్లో సిం గిల్ డిజిట్‌కు పరిమితమైంది. సంగారెడ్డి జిల్లాలోని న్యాల్‌కల్‌లో 9.5 కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. న్యాల్‌కల్ 9.5, కోహీర్ 9.6, పోతిరెడ్డిపేట్ 9.6, ఝరా సంఘం 9.9, కంగ్టి 9.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డ య్యాయి. ఉమ్మడి జిల్లాలో మరో 16 ప్రాంతాల్లో 11 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్ర తలు రికార్డయ్యాయి. గురువారం సాయంత్రం నుంచి చలి తీవ్రత తగ్గుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో... సంగారెడ్డిలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ఉమ్మడి మెదక్ జిల్లాతో ఇందిరమ్మకు ప్రత్యేక అనుబంధం

- ఇక్కడి నుంచే ఎంపీగా గెలిచి ప్రధాని అయ్యారు
- ఆనాడు కాంగ్రెస్ అగ్రనేతలు రాంచంద్రారెడ్డి, బాగారెడ్డి కోరిక మేరకు ఇక్కడ పోటీచేసి గెలిచారు
- సంగారెడ్డి ఓడీఎఫ్ ఫ్యాక్టరీ, బీడీఎల్, ఇక్రిశాట్ తెచ్చిన ఘనత ఇందిరాగాంధీదే
- జయంతి వేడుకల్లో ప్రసంగించిన జగ్గారెడ్డి


ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాని, స్వర్గీయ ఇందిరాగాంధీ 108వ జయంతిని జగ్గారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి జగ్గారెడ్డి ప్రసంగించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో ఇందిరాగాంధీకి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. మెదక్ పార్లమెంటు నుంచి ఎంపీగా గెలిచి ప్రధాని అయ్యారని, ఆమె చొరవతోనే సంగారెడ్డి జిల్లాలో ఓడీఎఫ్, బీడీఎల్, ఇక్రిశాట్ సాకారమయ్యాయని వివరించారు. తోపాజి అనంతకిషన్, చేర్యాల ఆంజనేయులు, రాంరెడ్డి, కూన సంతోష్, సత్యనారాయణ, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సాకులు చెప్పొద్దు

- మెనూ ప్రకారం భోజనం అందించాలి
- కలెక్టర్ హైమావతి

కొమురవెల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని, కూరగాయాలు దొరకలేదని సాకులు చెపొద్దని కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. రాజీవ్‌రహదారి సమీపంలోని కొమురవెల్లి కేజీబీవీ పాఠశాలను బుధవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న రాత్రి భోజనాన్ని పరిశీలించారు. కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాలకు చెందిన రెండు కేజీబీవీలు ఒకేచోట కొనసాగుతున్నాయని, మొత్తం 300 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నట్లు సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. 300 మందికి వడ్డించడానికి చాలా సమయం పడుతుందని సిబ్బందిని పెంచి పిల్లలకు వేడి భోజనాన్ని వడ్డించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టోర్‌రూంలో ఉన్న కూరగాయాలు, వంట సామాగ్రిని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.


అక్కన్నపేట మండలం గౌరవెల్లిలో చైన్‌మిషన్‌తో వరి పంట కోస్తున్న దృశ్యం

కోతల భారం

కొన్నిరోజుల క్రితం తుఫాను ప్రభావంతో రైతులపై అకాల వర్షాలు పగబట్టాయి. భారీ వర్షాల వల్ల పొలాలు బురదమయంగా మారాయి. పంట నేలవాలడంతో రైతులు కోతలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు ఉండడం వల్ల సాధారణ హార్వెస్టర్లు పొలాల్లోకి వెళ్లడం లేదు. రైతులు చైన్ మిషన్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో గంటకు రూ.3,500 నుంచి రూ. 4వేల వరకు చెల్లించాల్సి వస్తుండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాల దెబ్బకు ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తెగుళ్లు, ఎడతెరిపి లేని వర్షాలతో దిగుబడి అంతంత మాత్రంగా ఉండగా, వరి కోతలకు రైతులపై అదనపు భారం పడుతోంది.

అక్కన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి)

- అకాల వర్షాలకు బురదమయంగా పొలాలు
- పొలాల్లోకి వెళ్లలేని హార్వెస్టర్లు..చైన్ మిషన్లతో కోతలు
- గంటకు రూ.3,500 నుంచి 4వేలు
- వేధిస్తున్న కూలీల కొరత
- పెరుగుతున్న కోత ఖర్చు

జిల్లాలో 1,35,989 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ఇటీవల మొంథా తుఫాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా అకాల వర్షాలకు వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల పైరు నేలవాలింది. లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటికీ నీరు నిలిచి ఉండగా, కొన్నిచోట్ల పొలాల్లో తడి ఆరడం లేదు. బురదతో టైర్ల హార్వెస్టర్లు నడవడం కష్టంగా మారింది. దీంతో వరి పంట కోయడానికి రైతులు రెట్టింపు ఖర్చు చేస్తున్నారు. టైర్ల హార్వెస్టర్ల యజమానులు గంటకు రూ. 2వేలు, చైన్ మిషన్ యజమానులు గంటకు రూ. 3,500 నుండి రూ. 4 వేలు వరకు వసూలు చేస్తున్నారు. బురద, నీటి నిల్వ కారణంగా ట్రాక్టర్లు కూడా పొలాల్లోకి వెళ్లడం సాధ్యం కావడం లేదు. హార్వెస్టర్ ట్యాంకు నిండిన ప్రతీసారి పొలం దాటి గెట్టుకు రావాల్సి వస్తోంది. దీంతో కోత సమయం పెరుగుతుండటంతో అదనంగా చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.


జనగామలో నేలవాలిన వరి పంట

దొరకని కూలీలు, అధిక ఖర్చు

హార్వెస్టర్లు అందుబాటులో లేని ప్రాంతాల్లో రైతులు కూలీల సాయంతో వరి కోతలు చేపడుతున్నారు. పొలాలు బురదమయంగా ఉండటంతో కోసిన వరిని గెట్లపై కుప్పలుగా పెడుతున్నారు. దీనికి సమయం వృథా అవుతోంది. వరి కోత, కుప్పలు ఎత్తడం, నూర్పిడి అన్ని కలిపి

మిగతా 8లో...

అలంకారప్రాయం

- కొన్నేళ్లుగా పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్
- సిద్దిపేటలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తం
- ఇష్టారీతినా వెళ్తున్న వాహనదారులు
- జరిమానాలకే పరిమితమైన పోలీసులు

సిద్దిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంగా ఏర్పాటైన తర్వాత అన్ని రంగాల్లోనూ వేగంగా అభివృద్ధి చెందింది. చదువు, ఉద్యోగం, వ్యాపారం రిత్యా పట్టణంలో నివసించే వారి సంఖ్య కూడా పెరిగింది. ఈ క్రమంలో పట్టణంలోని పలు చౌరస్తాల వద్ద రద్దీ పెరిగి ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగేది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు రద్దీ ఉన్న బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి లక్షలాది నిధులతో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మొదట్లో బాగానే పని చేసినా, రాను రాను సిగ్నళ్లు మొరాయించి గత కొన్నేళ్లుగా పని చేయడం లేదు. ఆ తర్వాత మరమ్మతులు చేయించి తిరిగి ప్రారంభించినా, అవి కొన్ని నెలలు మాత్రమే పనిచేసి, గతేడాదికి పైగా తిరిగి మూలనపడ్డాయి. దీంతో కొన్ని నెలలుగా ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయకపోవడం, పలు చౌరస్తాల వద్ద ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ సరిగా లేకపోవడంతో.. వాహనదారులు కూడా "మా ఇష్టం అన్నట్లుగా వెళ్తున్నారు. దీంతో నిత్యం పట్టణంలో ట్రాఫిక్ పెరిగిపోయి వాహనాల హారన్ల మోత మోగిపోతుంది. పలు జంక్షన్ల వద్ద ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి.


సిద్దిపేటలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

పలు చోట్ల నిమిషాల కొద్దీ రద్దీ

పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా, కాంచీట్ చౌరస్తా, విక్టరీ చౌరస్తా, గోల్డెన్ బేకరి చౌరస్తా, మోడల్ బస్టాండ్, పాత ఎల్ఐసీ ఆఫీస్, సీతారామంజనేయ థియేటర్ వద్ద, కొత్త బస్టాండ్‌లోకి వెళ్లే దారి, హౌజింగ్ బోర్డు కమాన్, బ్లాక్ ఆఫీస్ చౌరస్తా, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే చౌరస్తాల వద్ద నిత్యం ట్రాఫిక్ రద్దీగా మారింది. ప్రధాన రహదారిపైనే వాహనాలను పార్కింగ్ చేయడం, రైతు బజార్, ప్రైవేట్ బ్యాంకులు, ఇతర స్టాండ్‌ల వద్ద వాహనాలు, ఇరుకు రహదారుల్లోని ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద ఇష్టారీతినా వాహనాలను పార్కింగ్ చేయడం ప్రధాన సమస్యగా మారింది. ఇక పండుగలు వస్తే గాంధీ రోడ్డు, సుభాష్ రోడ్డు లాంటి ప్రాంతాల్లోని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం పోలీసులకు సైతం తలనొప్పిగా మారింది.


ఇష్టారీతిన వెళ్తున్న వాహనదారులు

జరిమానాలకే పరిమితం

పలు కూడళ్ల వద్ద సమయానుసారం నిరంతరం ఉండాల్సిన ట్రాఫిక్ పోలీసులు, కాసేపు ఉండి ఆ తర్వాత కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఉన్న కాసేపు కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హెల్మెట్ ధరించని వాహనదారులు, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ వంటి వాటిపై దృష్టి సారిస్తున్నారని, ఇక సాయంత్రం నుంచి రాత్రి సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించేందుకే పరిమితమయ్యారని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరాలంటే ముందుగా ట్రాఫిక్ సిగ్నళ్ల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైజ్ఞానిక వేడుక షురూ

- ఆకట్టుకుంటున్న విద్యార్థుల ఎగ్జిబిట్లు

సిద్దిపేట కల్చరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): సైన్స్ సంబురం మొదలైంది. వైజ్ఞానిక ప్రదర్శనలకు సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వేదికైంది. జిల్లాస్థాయి ప్రేరణ, బాల వైజ్ఞానిక ప్రదర్శనను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో కలిసి కలెక్టర్ హైమావతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న వయసులోనే పిల్లలు విషయం పట్ల అవగాహన పెంచుకోవడం సులభమని, చిన్ననాటి ఆలోచన చాలా చురుగ్గా ఉంటుందన్నారు. భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం రచించిన వింగ్స్ ఆఫ్ ఫైర్ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదివి, ఉన్నతమైన కలలు కనాలని, వాటి సాకారానికి నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్య బాగుంటుందని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో నిష్ణాతులుగా రాణిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం వస్తున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. అంతకుముందు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సంవత్సరంలో సైన్స్ రంగంలో జిల్లా సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ఆర్పీఏ


వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మెంబర్ సూర్య వర్మ, జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు అర్బన్, రూరల్ మండలాల పాఠశాల విద్యార్థులు ఎగ్జిబిట్లను తిలకించారు.

అబ్బురపరిచే ఆవిష్కరణలు

చిట్టి మెదడుల్లో పుట్టిన ఆలోచనలు ఆవిష్కరణలుగా మారి అందరిని ఆకట్టుకుంటున్నాయి. వివిధ పాఠశాలలకు చెందిన 187 ఇన్‌స్పైర్ ఎగ్జిబిట్లు, 236 రాష్ట్రీయ బాలల

మిగతా 8లో...


విద్యార్థినిల సాంస్కృతిక ప్రదర్శన


ఆటోమెటిక్ వాటర్ లెవల్ కంట్రోల్ ప్రాజెక్ట్


బద్దిపడగలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పారిశ్రామికవేత్త ప్రశాంత్ రెడ్డి, పక్కనే నూతన దంపతులు

కుమార్తె పెళ్లికి.. ఊరంతా పట్టుచీరలు

నంగునూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో స్థిరపడ్డ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త తడిసిన ప్రశాంత్‌రెడ్డి కూతురు వివాహం ఇటీవల దుబాయ్‌లో అంగరంగ వైభవంగా జరిపించారు. అయితే, ప్రశాంత్‌రెడ్డి తాను పుట్టిన ఊరిని మరువకుండా ఊరిలో అందరికీ భోజనాలు పెట్టించారు. అంతేకాదు మహిళలకు పట్టుచీరలను పంపిణీ చేశారు. ప్రశాంత్‌రెడ్డి కుటుంబీకులు పూర్వం నుంచి ఏ పండుగ చేసినా గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించడంతో దానధర్మాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ప్రశాంత్‌రెడ్డి-సునీత దంపతులు వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. దుబాయ్‌లోని బహెరాన్‌లో ఇటీవల తన చిన్న కూతురు సుస్మితకి సిద్ధార్థరెడ్డితో వివాహం జరిపించారు. తన సొంత ఊరిలోని గ్రామస్థుల కలవాలనే ఉద్దేశంతో బుధవారం బద్దిపడగలో విందు ఏర్పాటు చేశారు. నూతన వధూవరుల చేతుల మీదుగా 1300 మంది మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన ఊరికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు.పెద్దల నుంచి వచ్చిన ఆచారంలో భాగంగా గ్రామ దేవతలను కొలచి ప్రజలకు తోచిన సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామనాయకులు, బంధువులు పాల్గొన్నారు.

నిలిచిన పనులు..నిధులు వృథా

- గజ్వేల్‌లో అసంపూర్తిగా నిర్మాణాలు
- నిలిచిన పనులతో ప్రజా భవనాలు

7


వర్గల్ : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం భక్తులు స్వస్తిక్ ఆకృతిలో కార్తీక దీపాలకు దీపారాధన చేశారు. అర్చకులు స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, పంచాయతీ రాజ్ జిల్లా అధికారి వినోద్‌కుమార్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు విద్యేతర, విషయాలు కళా సాంస్కృతిక, క్రీడా రంగాలలో విశ్వ విజేతలుగా నిలవచ్చని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, పంచాయతీ రాజ్ జిల్లా అధికారి వినోద్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచికళా నిలయంలో నిర్వహించిన యువజన ఉత్సవాల ముగింపు సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ గురువుల సముచిత శిక్షణలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.


యువజనోత్సవాల్లో బహుమతుల ప్రదానం

యువజనోత్సవాల విజేతలు వీరే

జానపద నృత్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్ ప్రథమ స్థానంలో నిలిచింది. టీఎస్ఎంఎస్ ఇబ్రహీం నగర్ ద్వితీయ, కేజీబీవీ హుస్నాబాద్ తృతీయ స్థానంలో నిలిచింది. ఫోక్ సాంగ్స్‌లో అనిల్ కుమార్ ప్రథమ, ఎం.భవాని ద్వితీయ స్థానం సాధించారు. స్టోరీ రైటింగ్‌లో ఉమేరా జరిన్ జీజేసీ సిద్దిపేట ప్రథమ, జి నందిని కేజీబీవీ హుస్నాబాద్ ద్వితీయ స్థానం..పెయింటింగ్‌లో బి.క్రాంతి టీజీఎమ్ఎస్ లచ్చపేట ప్రథమ స్థానం. బుట్ట కావ్య ఎంజేపీ వర్గల్ ద్వితీయ స్థానం. డిక్లరేషన్‌లో నేలపల్లి సాయికిరణ్ ప్రథమ, మూర్తి సాహితీ రెడ్డి ద్వితీయ, కవితల్లో సానియా సదా ఇందిరానగర్ ప్రథమ స్థానం దక్కించుకున్నది. అలాగే సైన్స్‌మేళాలో ప్రణయ్ జడ్పీహెచ్ఎస్ దామరకుంట ప్రథమ, ఎండీ అజీజ్ లచ్చపేట ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఐదుగురిపై కేసు

పటాన్‌చెరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇతరుల పొలంలో అక్రమంగా మట్టి తవ్వుతున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామం సర్వేనంబర్లు 224, 225లలో చిన్న హనుమంతరెడ్డి పేరుపై ఐదు ఎకరాల భూమి ఉంది. యజమాని మృతి చెందగా, ఆయన కుమారుడు పుల్లయ్యగారి వెంకటనర్సింహారెడ్డి కుటుంబసభ్యులతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇదే అదునుగా గ్రామానికి చెందిన దేవ్‌రెడ్డి, ప్రకాష్‌నాయక్, రవీందర్, నితిన్, ప్రశాంత్ పొలంలో మట్టి తవ్వి అక్రమంగా టిప్పర్‌లతో రాత్రి సమయాల్లో తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వెంకటనర్సింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిలిచిన పనులు.. నిధులు వృథా

ప్రజాధనమంటే లెక్కలేదా?


నిరుపయోగంగా గజ్వేల్ ఆధునిక బస్టాండ్

- గజ్వేల్‌లో అసంపూర్తిగా నిర్మాణాలు
- నిలిచిన పనులతో నిరుపయోగంగా ప్రజా భవనాలు
- రూ.కోట్లు వెచ్చించినా దక్కని ఫలితం
- ఇబ్బందుల్లో ప్రజలు.. త్వరిగతిన పూర్తిచేయాలి విజ్ఞప్తి

గజ్వేల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు, రోడ్లు అసంపూర్తిగా నిలిచిపోవడం, ప్రజా వినియోగంలోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ నిర్మాణాలను ఇప్పుడు పట్టించుకునే వారే కరువయ్యారని, దీంతో ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ సమస్య మరింత జఠిలమైందని చెబుతున్నారు. అసంపూర్తి పనులు పూర్తి చేస్తే పాత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిలిచిపోయిన రింగ్‌రోడ్డు

రూ.280 కోట్ల అంచనా వ్యయంతో 22 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీని కారణంగా కంటైనర్లు, భారీ లారీలు పట్టణంలోని ప్రధాన రహదారి గుండా వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. రింగ్‌రోడ్డులోని జాలిగామ వద్ద రైల్వే క్రాసింగ్ పనులు జరుగుతున్నప్పటికీ, పాత ఆర్డీవో కార్యాలయం వద్ద సుమారు 150 మీటర్ల రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో చిట్యాల, భువనగిరి, ప్రజ్ఞాపూర్, గజ్వేల్, తూప్రాన్, నర్సాపూర్, సంగారెడ్డి లింక్ రోడ్డు మార్గంలో వెళ్లే వాహనాలు తప్పనిసరిగా మునిసిపాలిటీ ప్రధాన రోడ్డు గుండా వెళ్లాల్సి వస్తున్నది. ఈ రింగ్‌రోడ్డు పూర్తయితే వాహనదారులు, ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరతాయని భావిస్తున్నారు. టెలికాం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీనివాస్ ఈ రింగ్‌రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అలంకారప్రాయంగా ఆడిటోరియం..

రూ.30 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా నిర్మించిన మహతి ఆడిటోరియం అలంకారప్రాయంగా మిగిలింది. పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లకు ఇస్తున్నప్పటికీ, వంట సామాగ్రి, పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల దీనిని వినియోగించుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.



నిరుపయోగంగా ఆడిటోరియం


18వ వార్డులోని కమ్యూనిటీ హాల్ దుస్థితి

పత్తి మార్కెట్

పాత ఆర్డీవో కార్యాలయం వెనుక 22 ఎకరాల స్థలంలో రూ.6 కోట్లతో నిర్మించిన కాటన్ మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరగడం లేదు. కొండపోచమ్మసాగర్(గజ్వేల్ కెనాల్) కాలువ మార్కెట్ స్థలం మధ్యలో నుంచి వెళ్లడం వల్ల స్థలం రెండుగా విడిపోయింది. ప్రస్తుతం స్థలం అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి కనీసం కంచె నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆధునిక బస్టాండ్, బస్‌బేలు..

రూ.6 కోట్ల వ్యయంతో పట్టణానికి కిలోమీటరున్నర దూరంలో నిర్మించిన ఆధునిక బస్టాండ్‌లోకి ఒక్క బస్సు కూడా వెళ్లడం లేదు. అలాగే రూ.2.51 కోట్లతో గజ్వేల్ పట్టణంలో నిర్మిస్తున్న బస్‌బే, రూ.3.81 కోట్లతో ప్రజ్ఞాపూర్‌లో నిర్మిస్తున్న బస్టాండ్‌ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. రవాణా శాఖ మంత్రి జిల్లాకు చెందిన వారైనప్పటికీ, ఈ నిర్మాణాలు పూర్తికాకపోవడం గమనార్హం.

ప్రజలకు అందుబాటులోకి తేవాలి

నిలిచిపోయిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి, వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ప్రజలకు ఇబ్బందులు కలిగించడం సరికాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం.

-పాల రమేశ్‌గౌడ్ , బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి

త్వరితగతిన పూర్తి చేయాలి

బస్టాండ్‌లు, రింగ్‌రోడ్డు, కమ్యూనిటీ హాళ్లకు నిధులు కేటాయించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. బస్టాండ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై నిలబడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక రింగ్‌రోడ్డు పూర్తికాకపోవడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది. ఇప్పటికైనా స్పందించాలి.

- కమ్మరి శ్రీనివాస్, టెలికాం బోర్డు సభ్యుడు, గజ్వేల్

భూసార పరీక్షా కేంద్రం

రూ.81.20 లక్షల వ్యయంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన భూసార పరీక్షా కేంద్రం రైతులకు అందుబాటులోకి రాలేదు. 2023 ఏప్రిల్ 21న ప్రారంభించినప్పటికీ, రెండున్నరేళ్లు గడిచినా సిబ్బందిని, పరికరాలను కేటాయించలేదు. దీంతో రైతులకు భూసార పరీక్షలు నిర్వహించి సలహాలు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది.

ఇతర నిర్మాణాలు..

రూ.కోటి వ్యయంతో 18వ వార్డులో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. బాల, బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లలోని ఆడిటోరియంలు, పాత ఎంపీడీవో ఆఫీస్ భవనం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, కోర్టు భవన నిర్మాణ పనులు కూడా నెమ్మదిగా సాగుతున్నాయి. రేడియల్ రోడ్ల అభివృద్ధి పనులు, జంక్షన్ల అభివృద్ధి పనులు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి.

భారతదేశ ఉక్కు మహిళ ఇందిరా గాంధీ

- మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్


ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తన పరిపాలనా దక్షతతో భారతదేశ ఉక్కు మహిళగా పేరుగాంచిన వీరవనిత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరా గాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి పురస్కరించుకొని చిట్కుల్‌లోని ఆయన నివాసం వద్ద ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఇందిరమ్మ పాలన సంక్షేమం, అభివృద్ధికి మారుపేరుగా నిలిచిందని తెలిపారు. ఆమె ముందుచూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగానే దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితోనే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తుందని వివరించారు.

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు హుస్నాబాద్ ఉపాధ్యాయుడు

హుస్నాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు హుస్నాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పంజా రాజమల్లయ్యకు ఆహ్వానం అందింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ విభాగంలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ సౌజన్యంతో రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో 'పాఠ్యప్రణాళిక బోధనలో సాంస్కృతిక అంశాలు' అనే అంశంపై ఈ వర్క్‌షాప్ జరుగనున్నది. రాజమల్లయ్య 2025-26, 2026-27కు గాను డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌గా ఎంపికయ్యారు. ప్రాథమిక స్థాయిలో సాంస్కృతిక విద్యను బలోపేతం చేయడం కోసం, సీసీఆర్‌టీ నేషనల్ కల్చరల్ అంబాసిడర్‌గా వ్యవహరించడానికి ఈ కార్యశాల నిర్వహిస్తున్నట్లు రాజమల్లయ్య తెలిపారు. ఇందులో దేశవ్యాప్తంగా 150 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ నుంచి రాజమల్లయ్యతో పాటు ములుగు జిల్లాకు చెందిన తాళిశెట్టి సుమతిదేవి హాజరుకానున్నారని వివరించారు. రాజమల్లయ్యను ఎస్‌సీఈఆర్‌టీ (తెలంగాణ) డైరెక్టర్ గాజర్ల రమేష్, డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ ఎంఈవో బండారి మనీల, హెచ్‌ఎం వాసుదేవరెడ్డి తదితరులు అభినందించారు.

'అందెశ్రీ సాహిత్య అకాడమీ ఏర్పాటు చేయాలి'


అందెశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సాహితి సంస్థ సభ్యుల

సంగారెడ్డి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కవి అందెశ్రీ పేరుమీద రాష్ట్ర ప్రభుత్వం జానపద సాహిత్య అకాడమీని ఏర్పాటు చేయాలని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డా. సంగిశెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో బుధవారం తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర గీతాన్ని అందించిన అందెశ్రీ, తెలంగాణ జాతి గర్వించేలా ఉద్యమంలో ప్రజల్ని జాగృతం చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర అందెశ్రీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మెతుకుసీమ సాహితి సంస్థ అధ్యక్షుడు పూసల లింగా గౌడ్, ఫ్రెండ్స్ విజ్ఞాన కేంద్రం ఫౌండర్ మోహన్, విశ్రాంత ఎంఈవో అంజయ్య, తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు చింతల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు

నర్సాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భార్యతో అక్రమ సంబంధం ఉన్నదనే కారణంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్సారీని హత్య చేసిన కేసులో నలుగురు నిందితులను 24 గంటల్లో పట్టుకుని అరెస్టు చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ సీఐ కార్యాలయంలో సీఐ జానారెడ్డి, ఎస్ఐ రంజితకుమార్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జహీరాబాద్‌కు చెందిన మహ్మద్ షబ్బీరుకు నర్సాపూర్‌కు చెందిన మహిళతో వివాహమైంది. షబ్బీర్ దొంగతనాల కేసులో జైలులో ఉన్నప్పుడు అతడి భార్య తన స్నేహితురాలి భర్త అన్సారీతో అక్రమ సంబంధం పెట్టుకుంది. జైలు నుంచి బయటికొచ్చిన మహ్మద్ షబ్బీర్‌కు ఈ విషయం తెలియడంతో తన తల్లిదండ్రులు రేష్మా, షబ్బీర్లతో పాటు స్నేహితుడు శివారెడ్డి, మైనర్ బాలుడైన తన భార్య తమ్ముడిని తీసుకుని ఈ నెల 17న నర్సాపూర్‌కు వచ్చాడు. తన భార్యను బెదిరించి ఫోన్‌లో అన్సారీని నర్సాపూర్ రాయరావు చెరువు వద్దకు రప్పించాడు. అక్కడ తనవెంట వచ్చిన వారి సహకారంతో అన్సారీ కాళ్లు చేతులు పట్టుకుని, మహ్మద్ షబ్బీర్ వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి హత్య చేసి పొదల్లో పడేసి పారిపోయారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ జానారెడ్డి నేతృత్వంలో పోలీసులు రంగంలోకి దిగి, బిదర్ పారిపోతున్న నిందితులను గురువారం పట్టుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన సీఐ, ఎస్ఐతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

క్రీడల్లో గీతం విద్యార్థుల ప్రతిభ




విజేతలతో గీతం అధికారులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ విద్యార్థులు వివిధ క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి సంస్థకు కీర్తిని తెచ్చిపెడుతున్నారు. మందలపు శ్రీకాంత చెన్నైలోని జేఎన్ఎల్ఎస్‌లో జరిగిన 'ది చీఫ్ మినిస్టర్స్ ట్రోఫీ గేమ్స్' రాష్ట్ర స్థాయి పోటీలలో స్ట్రీట్ ఫైటర్ 6 లో రజత పతకాన్ని సాధించారు. రుషికేశ్ మార్కా హైదరాబాద్ హైటెక్ సిటీలో నిర్వహించిన వీవైటీ యాక్టివ్ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. అదే టోర్నమెంట్‌లో మరో విద్యార్థి ఆయుష్‌తో కలిసి పురుషుల డబుల్స్‌లో రజత పతకాన్ని కూడా సాధించారు. ఆశ్రిత రాజు దాట్ల ఇటీవల జరిగిన భారతీయ పికిల్ బాల్ జాతీయ పోటీలలో టీనేజ్ బాలికల రాష్ట్ర జట్టు ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. విజేతలను గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.ఆర్. శాస్త్రి, క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా పిలిప్, క్రీడల విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. నారాయణరావు చౌదరి అభినందించారు.

కార్తీక శోభ

కొమురవెల్లి, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం మహామండపంలో పవిత్ర కార్తీకమాస బహుళ చతుర్దశిని బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీరుద్రసూక్తం, హరిహర స్తోత్రముల పారాయణం నిర్వహించారు. ముగ్గులతో పూర్ణకుంభం ఆకృతిని రచించి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపాకాంతులతో ఆలయం మండలం వెలిగిపోయింది.



క్రీడాకారులను ప్రోత్సహించాలి

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర మైదానంలో అండర్-17 బాలురకు నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే టాస్ వేసి ప్రారంభించారు. ముగింపు కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి డీఈవో విజయ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, టోర్నమెంట్ కన్వీనర్ మాధవరెడ్డి పాల్గొన్నారు.

30 వేల మందితో వందేమాతరం గీతాలాపన

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న 30 వేల మంది విద్యార్థులతో వందేమాతరం గీతాలాపనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం పటాన్ చెరు క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ, పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు నాగేశ్వరరావు నాయక్, పీపీ రాథోడ్, ఎంపీడీవో యాదగిరి, డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతారం జాతరలో అపశ్రుతి... గుండంలో నీట మునిగి వ్యక్తి మృతి


తుకారాం మృతదేహం

మునిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల పరిధిలోని అంతారం జీవన్ముక్త పాండురంగ విఠలేశ్వర స్వామి వారి ఆలయ జాతర ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. జహీరాబాద్ మండలం ఖాసింపూర్ గ్రామానికి చెందిన ధనసిరి తుకారాం(43) జాతర సందర్భంగా బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం జీవన్ముక్త పాండురంగ విఠలేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఉన్న గుండంలో స్నానం చేసేందుకు దిగి, ఈత సరిగ్గా రాక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య చిలకమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

ట్రాక్టర్, ఆటో ఢీ.. విద్యార్థి..


దేవరాజ్ (ఫైల్)

పాపన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఆటో ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధి నాగసాన్ పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. పోడ్చన్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి పచ్చ దేవరాజ్ (17) అపుడప్పుడు క్యాటరింగ్ బాయ్ వెళ్తుంటాడు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొందరితో కలిసి ఆటోలో ఏడుపాయలకు క్యాటరింగ్‌కు వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఆటోలో ఇంటికివస్తుండగా నాగసాన్ పల్లి గ్రామ శివారులో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి దేవరాజ్‌తో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. దేవరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

పటాన్‌చెరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సదాశివపేట మండలం నాగసానిపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు(38) ప్రైవేటు పరిశ్రమలో సెక్యూరిటీ అధికారిగా పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి పటానచెరు నుంచి మోటారు సైకిల్‌పై వెళతుండగా, రుద్రారం గీతం యూనివర్శిటీ సమీపం యూటర్న్ వద్ద పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వెళతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన నర్సింహులు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

- ఐదు నెలల క్రితమే ప్రేమ వివాహం


వెంకటేశ్ మృతదేహం

తూప్రాన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణ పరిధి కరీంగూడ వద్ద చోటు చేసుకుంది. తూప్రాన్-2 ఎస్ఐ యాదగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ మండలం ముప్కల్ గ్రామానికి చెందిన పన్నీరు వెంకటేశ్ (24)కు ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం జరుగగా హైదరాబాద్‌లో నివాసముంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 15న ఆర్మూర్‌లోని సోదరి వద్దకు వచ్చిన అతడు.. 16న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తున్నాడు. తూప్రాన్ పట్టణ పరిధి కరీంగూడ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి వివరించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

- ఆరు నెలల క్రితం ప్రేమించి పెళ్లి
- వరకట్న వేధింపులే కారణమన్న తండ్రి

జగదేవ్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకున్న యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అలిరాజపేటలో బుధవారం జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. చిన్న ఆరెపల్లికి చెందిన సదా అఫ్రీన్(21) ఇదే మండలంలోని అలిరాజపేట గ్రామానికి చెందిన ఫరీద్(22) అనే యువకుడు ప్రేమించుకున్నారు. ప్రేమ విషయం ఇరువురి పెద్దలకు చెప్పి, వారి సమక్షంలో ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత ఇద్దరూ అన్యోన్యంగానే ఉండగా, తర్వాత భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి గదిలో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందింది. ఎస్ఐ కృష్ణారెడ్డి సంఘటనాస్థలానికి వచ్చి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. రాత్రి సమయం కావడం వల్ల మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

మా బిడ్డను చంపారు...

తమ బిడ్డను భర్త, అత్తమామ కలిసి చంపారని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. మూడు నెలల నుంచి వరకట్నం తేవాలని వేధింపులకు గురి చేస్తున్నారని మృతురాలి తండ్రి షాబుద్దీన్ ఆరోపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

అదృశ్యమై.. చెరువులో శవమై..

దుబ్బాక, నవంబరు19(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఒక వృద్ధురాలు చెరువులో శవమై తెలిన సంఘటన బుధవారం దుబ్బాకలో జరిగింది. దుబ్బాక పట్టణంకు చెందిన మహబూబీ(65) సోమవారం ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. బుధవారం సాయంత్రం రామసముద్రం చెరువులో శవమై తేలింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో అగ్నిప్రమాదం

జహీరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ విద్యుత్ కార్యాలయంలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రిపేర్ కేంద్రం పైనున్న విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు పడడంతో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది త్వరితగతిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో భారీ ప్రమాదం తప్పింది.



కోలుకుంటున్న విద్యార్థిని

గజ్వేల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17, సోమవారం గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని పాఠశాలలో సానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మధుప్రియ కోలుకుంటున్నట్లు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి వైద్యులు తెలిపారు. ములుగు మండలం తునికిబొల్లారం గ్రామానికి చెందిన మధుప్రియ ప్రభుత్వ పాఠశాలలోని మరుగుదొడ్లో సోమవారం సాయంత్రం సానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్‌లు విద్యార్థినిని గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని, గురువారం ఆసుపత్రి నుంచి డిస్చార్జ్ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి రూ.50వేల జరిమానా

గజ్వేల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి జరిమానా పడింది. గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం.మురళీ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పలు చౌరస్తాల్లో ఐదుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడగా, బుధవారం వారిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. విచారణ జరిపిన న్యాయమూర్తి ఐదుగురికి రూ.10వేల చొప్పున రూ.50వేల జరిమానా విధించారు.

దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

కుకునూరుపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కుకునూరుపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమ శాఖలో సబ్సిడీ లోన్ కోసం ఆరుగురు గతంలో దరఖాస్తు చేసుకున్నారని వీరిని మండల స్థాయి కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి 11 గంటలకు రావాల్సిందిగా ఆయన తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ పత్రాలను తీసుకురావాలని తెలిపారు.

తొగుట ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి బదిలీ

తొగుట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తొగుట ఎంపీడీవోగా ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎ. శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. అతడి స్థానంలో సిద్దిపేట అర్బన్ మండలంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వర్‌కు తొగుట ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

జగదేవ్‌పూర్‌లో గ్రామసభ

జగదేవ్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో బుధవారం గ్రామ కార్యదర్శి రాంరెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు, నాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డీఎల్పీవో లత మాట్లాడుతూ జగదేవ్‌పూర్‌లో ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగర్ గ్రామంలో బుధవారం జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్యశిబిరాన్ని ఎస్‌ఎస్‌ఎఫ్ఎ చైర్మన్ గంగాధర్ ప్రారంభించారు. హుస్నాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న శీతాకాల శిబిరంలో భాగంగా మూడవ రోజున ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అమరుల స్థూప నిర్మాణానికి భూమిపూజ

సిద్దిపేట, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో ఈనెల 21న అమర వీరుల స్థూపాన్ని నిర్మించడానికి భూమిపూజ జరుగుతుందని ఉమ్మడి మెదక్ జిల్లా అమరుల స్మారక కమిటీ నాయకులు యాదగిరి, డప్పు శివరాజ్‌లు అన్నారు. బుధవారం మండలకేంద్రమైన మిరుదొడ్డిలో మాట్లాడారు.

రామకోటి సేవలు అమోఘం

గజ్వేల్ రూరల్ నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రామకోటి రామరాజు కృషి పట్టుదల అమోఘమని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు అన్నారు. రామకోటి రామరాజు 5 రూపాల నాణాలతో రూపొందించిన శివలింగం చిత్రాన్ని బుధవారం గజ్వేల్ ఏసీపీ నర్సింహులు ఆవిష్కరించారు.

పత్తికి స్లాట్ బుకింగ్ అవివేకం

● ఎలాంటి షరతులు లేకుండా కొనుగోళ్లు జరపాలి ● బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్‌లోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలుకు స్లాట్ బుకింగ్ పెట్టడం అవివేకమని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్‌లోని సాయిబాలాజీ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలోని రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గజ్వేల్ నియోజకవర్గంలో దాదాపు 30 నుంచి 40వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారని, యూరియా దొరకక, అధిక వర్షాలతో అసలే దిగుబడి తగ్గిందంటే.. పండించిన పంటను కొనుగోలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయడం దారుణమని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ సర్కారు మద్దతు ధరను కల్పిస్తూ ఆంక్షలు లేకుండా ఎకరాకు 13క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ఇక గజ్వేల్‌లో రైతాంగానికి అందుబాటులో ఉండేందుకు పత్తి మార్కెట్ యార్డును నిర్మిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మూసివేయడం దారుణమని, వెంటనే మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

చేర్యాల : పత్తికొనుగోలులో సీసీఐ నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేస్తూ సీపీఎంనాయకులు బుధవారం చేర్యాల పట్టణంలో జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధానరహదారిపై పాతబస్టాండు వద్ద ఆందోళన చేపట్టారు.

జాతీయ స్థాయికి ఎంపిక కావడం హర్షణీయం

గజ్వేల్ విద్యార్థులు నేషనల్స్‌కు ఎంపికవడం హర్షణీయమని వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-14కు ఎర్రవాడ హర్షవర్ధన్, అండర్-17కు కుమ్మరి సాయి ఎంపికవగా, వారిని శాలువాతో సత్కరించి, అభినందించారు.

చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్న నరేంద్రమోదీ

● ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

గజ్వేల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన దివంగత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్నారని ఏఎంసీ వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుఖేందర్‌రెడ్డి, సయ్యద్ మతీన్, నక్క రాములుతో కలసి విలేకరులతో మట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీల పాత్ర ఎనలేనిదని, రాజకీయ లబ్ధి కోసం ప్రధాని మోదీ చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్నారని, గాంధీల సేవలను ప్రజలు ఎప్పటికి మరచిపోరన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం దీర్ఘకాలిక ప్రయోజనాలు ఆశించి పెద్దపెద్ద ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఘనత వారికే దక్కుతుందన్నారు.

నూనె గింజల సాగు వైపు రైతులు మళ్లాలి

గజ్వేల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నూనె గింజల సాగు వైపు రైతులు మళ్లాలని గజ్వేల్ డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ పిలుపునిచ్చారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్(ఎన్‌ఎంఈవో-ఓఎస్) జాతీయ నూనె గింజల పథకం కింద ఉమెన్ పార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్(డబ్ల్యూఎఫ్‌పీవో) ఆధ్వర్యంలో రైతులు పొద్దుతిరుగుడు విత్తనాలను ఏవో గుండు నాగరాజుతో కలసి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నూనె గింజల సాగుకు ముందుకు రావాలని పిలుపునిచ్చిన ఆయన పొద్దు తిరుగుడు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ 58వ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అధ్యక్షతన ఈ పోటీలు ప్రారంభించారు ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీపీవో యస్. జయశ్రీ జిల్లా గ్రంథాలయ సంస్థ చెర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని సూచించారు. ఆడపిల్లలు కూడా అన్ని రంగాల్లో ముందుండి, విజేతలుగా నిలువాలన్నారు. భారత దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కొమురవెల్లి పీహెచ్‌సీని అభివృద్ధి పరచాలి

చేర్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :మల్లన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడునెలల పాటు లక్షలాదిమంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వైద్యసేవల నిమిత్తం ప్రభుత్వం కొమురవెల్లి పీహెచ్‌సీ స్థాయిని పెంచి మౌలికవసతుల కల్పనతో అభివృద్ధిపరచాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణం, రూరల్ మండలం, కొమురవెల్లి మండలానికి చెందిన 58మంది లబ్ధిదారులకు బుధవారం స్థానిక రేణుకాగార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఆర్‌ఎఫ్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుకలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని కంటికిరెప్పలా కాపాడిందన్నారు. కొమురవెల్లి పీహెచ్‌సీ అభివృద్ధి విషయమై జిల్లా కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌వో, వైద్యఆరోగ్యశాఖ మంత్రిని అభ్యర్థించారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి

మద్దూరు: ఎన్నికలముందు ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలలో పాలు పంచుకుంటూ సమగ్రాభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ధూళిమిట్ట మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

మద్దూరు మండలం గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఇట్టబోయిన కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెదడం పట్ల సంతాపం వ్యక్తంచేస్తూ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

కోతల భారం

(5వ పేజీ తరువాయి)

రూ. 6వేల నుంచి రూ.7వేల వరకు ఖర్చు పెరిగిందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలు నిండా ముంచాయని, ప్రభుత్వం నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మూడున్నర ఎకరాలు నీట మునిగింది



మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేశాను. తుఫానుతో వరి పంట పూర్తిగా నీట మునిగి నేలవాలింది. చైన్ మిషన్‌తో వరి పంట కోస్తే గంటకు రూ. 3,600 తీసుకుంటున్నారు. తుఫాను వల్ల పంట నష్టం జరిగి అదనపు ఖర్చులు ఎక్కువగా అవుతున్నాయి. ప్రభుత్వమే పంట నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలి.

- చీకట్ల తిరుపతి రైతు, గౌరవెల్లి

వరి పంట పూర్తిగా నేల వాలింది



తుఫాను వల్ల పంట పూర్తిగా నేలకొరిగింది. పంట కోయాలంటే పొలం నిండా నీళ్లు నిలిచి ఇబ్బందవుతుంది. చైన్ మిషన్‌తో పంట కోయాలంటే ఎక్కువ ధర తీసుకుంటున్నారు. పంట నేలకొరిగి గింజలు పూర్తిగా రాలిపోయాయి. ప్రభుత్వమే సాయం చేయాలి.

-కొమ్ముల మల్లవ్వ, గౌరవెల్లి

గాంధీ ఆస్పత్రిలో ఆకునూరు క్షతగాత్రులు

చేర్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో తీవ్రగాయాలపాలైన శెట్టి భాస్కర్‌తో పాటు అతడి కుటుంబీకులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేరారు. మొత్తం ఆరుగురు కుటుంబసభ్యులు గాయాలపాలవడంతో స్థానికుల సహాయంతో చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రి నుంచి సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించిన విషయం విధితమే. మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలేర్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి బుధవారం గాంధీ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వైద్యసేవలను ఆరా తీసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

చేర్యాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ బుధవారంగాంధీ ఆస్పత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ్మ ఓఎస్డీకి సమాచారం తెలిపారు. దీంతో ఆయన గాంధీఆస్పత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి సత్వర మెరుగైన వైద్యం అందించాలని సూచించి అప్రమత్తం చేశారు. అనంతరం నాగపురి కిరణ్‌కుమార్ క్షతగాత్రులకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే భువనగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ రూ.25వేలు ఆర్థికసహాయం అందజేశారు.



బాధితులను పరామర్శిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురికిరణ్ కుమార్

పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి

దౌల్తాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, పాఠశాలలను అభివృద్ధి పథంలో నడిపించాలని రాష్ట్ర ప్రాజెక్టు పరిశీలకులు జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాల, మండల పరిధిలోని తిర్మలాపూర్ జడ్పీ పాఠశాలను రాష్ట్ర 5.0 పరిశీలకులు సోమిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను, వసతులను, తరగతి గదుల పరిశుభ్రతను, విద్యార్థుల మూత్రశాలలను,విద్యార్థులకు, తాగు నీరు, విద్యార్థుల కమిటీ ఉపాధ్యాయుల స్కాఫ్ కమిటీలను మధ్యాహ్న భోజనం నిర్వాహణను పరిశీలించారు. తరగతి గది పరిశీలన చేసి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

వైజ్ఞానిక వేడుక షురూ

(5వ పేజీ తరువాయి)

వైజ్ఞానిక ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. ప్రతి నమూనా దేనికదే ప్రత్యేకంగా నిలుస్తుంది. వాటిలో కొన్నింటిని తయారు చేసిన విద్యార్థులను, గైడ్ టీచర్లను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

మల్టిపుల్ ఫర్టిలైజర్ డిస్పెన్సరీ విత్ మల్టీటాస్క్



సాధారణంగా వ్యవసాయ పనులు చేయాలంటే ఎక్కువ మంది మనుషులు అవసరం. సాగు చేసిన తర్వాత విత్తనాలు వేయడానికి, ఎరువులు అందించడానికి అధిక శ్రమ పడాల్సి వస్తుంది. మర్కూక్ మండలం దామరకుంట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని తయారు చేసిన ఈ పరికరం ఒకటే అయినా వివిధ పనులు చేస్తుంది. ముఖ్యంగా రైతులు పంటలకు ఎరువులు వేయడం, మందులు పిచికారీ చేసే సమయంలో శ్రమను తగ్గిస్తుంది. సైకిల్‌ను ముందుకు తోస్తున్నట్లుగా దీనిని ముందుకు పోనిస్తే, ఆటోమెటిక్‌గా అందులోని మందు మొక్కలకు పిచికారీ అవుతుంది. అలాగే ఘన, ద్రవ రూపంలోని ఎరువును కూడా ఈ పరికరం ద్వారా మొక్కలకు అందించవచ్చు. అంతేకాకుండా, ఈ పరికరం వెనుక కింది భాగంలో అమర్చిన నాగలి ద్వారా కలుపు మొక్కలను కూడా తీసివేయవచ్చు.

విద్యార్థిని: బి. సింధూజ, దామరకుంట జడ్పీహెచ్ఎస్

గైడ్ టీచర్: చిన్న బ్రహ్మయ్య

బాంబోస్టిక్స్‌తో ఇల్లు



తరుచుగా సంభవించే ప్రకృతి విపత్తుల్లో వరదల ఉధృతికి పెద్ద పెద్ద భవనాలు కూడా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో వెల్కటూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు చేసిన "డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్" అనే పరికరం కొంత ఉపశమనం కలిగిస్తుంది. వెదురు బొంగులతో (బాంబో స్టిక్స్) చేసిన ఇల్లు వల్ల వరదలు వచ్చినప్పుడు నీటిలో మునగకుండా ఉండే అవకాశం ఉంటుంది. అలాగే ఎండ, వాన, చలి వంటి ప్రకృతి కారకాల నుండి కూడా రక్షణ లభిస్తుంది.

విద్యార్థినులు: శ్రీవైష్ణవి, మయూరి, సాత్విక, రిషిక

గైడ్ టీచర్: కనకమాల

స్మార్ట్‌గ్లాసెస్



కళ్లు కనిపించని వారు (అంధులు) ఎక్కడికైనా వెళ్లాలంటే ఇతరుల సహాయం తప్పనిసరి. అలవాటు ఉన్న ప్రదేశాలైతే పర్లేదు కానీ, కొత్త ప్రదేశాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడతారు. సిద్దిపేట గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ గ్లాసెస్ అంధులకు ఎంతో ఉపయోగపడతాయి. ఈ గ్లాసెస్‌కు అమర్చిన సెన్సార్ వల్ల 5 మీటర్ల దూరం ఎదురుగా ఎవరు వచ్చినా లేదా అడ్డంకి ఉన్నా సెన్సార్ శబ్దం చేస్తుంది. దీంతో వారు అప్రమత్తమై, ప్రమాదాల నుంచి బయటపడవచ్చు.

విద్యార్థులు: సనా ఫాతిమా, అయేషా

గైడ్ టీచర్: విజయ్‌కుమార్

ఘనంగా ఇందిరమ్మ జయంతి



చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి



గజ్వేల్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్



సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఇందిరాగాధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లాలో ఇందిరాగాంధీ 108 జయంతి వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి)

ఇంటికి నిప్పంటుకుని కాలిబూడిదైన సామగ్రి



పద్మశాలీ కాలనీలో మంటల్లో కాలిబూడిదైన ఇంటి వస్తువులు, సామగ్రి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మశాలీ కాలనీలో మంగళవారం రాత్రి గీకురు లక్ష్మి అనే మహిళ ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు చెలరేగి ఇంటిలోని వస్తుసామగ్రి కాలిబూడిదైంది. ఇంటిలో మూడు గదులు ఉండగా ఇంటి వెనుక భాగంలోని గది పూర్తిగా కాలిపోయింది. దీంతో లక్ష్మి ఇంట్లోని నిత్యవసర సరుకులు,మంచాలు, దుస్తులు బూడిదయ్యాయి. దాదాపు ఒక లక్షపైన నష్టం జరిగిందని బాధితురాలు లక్ష్మి బోరున విలపించింది.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిద్దిపేట, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కివెంకటయ్య అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసిందని తెలిపారు. మొక్కలను అరబెట్టుకుని మార్కెట్‌కు తీసుకుని రావాలని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్నలకు 2400 మద్దతుధరను కల్పిస్తుందని తెలిపారు.

జనావాసాల నడుమ వైన్‌షాప్‌లు ఏర్పాటు చేయవద్దు

చేర్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని జనావాసాల నడుమ వైన్‌షాప్‌లు ఏర్పాటుచేయకూడదని పేర్కొంటూ సీపీఎంనాయకులు బుధవారం స్థానిక ఎక్సైజ్‌శాఖాధికారులకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు మాట్లాడుతూ.. గాంధీసెంటర్, చుంచనకోట క్రాసింగ్ రోడ్డు తదితర రద్దీ ప్రదేశాలతో పాటు జనావాసాల నడుమ వైన్‌షాపుల ఏర్పాటుకు వ్యాపారులు చర్యలు తీసుకుంటున్న క్రమంలో ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా మార్చే వైన్‌షాపుల ఏర్పాటును ఉపసంహరించని యెడల ఆందోళనల చేపడతామన్నారు.

రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు

కొండపాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలను నివారించడం కోసం పోలీసులు చర్యలు చేపట్టారు. కొండపాక మండలంలోని దుద్దెడ నుంచి తిమ్మారెడ్డిపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా రోడ్డుపైకి వచ్చిన చెట్లను చెట్లపొదల తొలగించడంతోపాటు డివైడర్ల మధ్యలో ఉన్న కాలువలను పూడ్చివేశారు. డివైడర్ మధ్యలో కాలువలు ఉండడంతో రోడ్డు దాటడం కోసం అందులో నుంచి ద్విచక్ర వాహనాలు వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో వాటిని పూర్తిగా మూసివేశారు కొమురవెల్లి కమాన్ వద్ద రోడ్డుపైకి వచ్చిన దుకాణాలను తొలగించారు. హెచ్‌కె ఆర్ టోల్ ప్లాజా సిబ్బందితోపాటు పోలీసులు ఈ చర్యలు చేపట్టారు.

ములుగు ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎస్సై రఘుపతిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి

ములుగు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ములుగు పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఎస్సై రఘుపతిని అన్నాసాగర్ మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో కలిసి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట గజ్వేల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాజిద్, నరేందర్‌రెడ్డితోపాటు తదితరులు ఉన్నారు.

జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీగా బండి నరేష్

జగదేవ్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సిద్దిపేట జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీగా జగదేవ్‌పూర్ మండలంలో తిగుల్ గ్రామానికి చెందిన బండి నరేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల చంద్రం, యువజన విద్యార్థి విభాగం ఐకాస రాష్ట్ర ఇన్‌చార్జి వనం రమేష్, రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరిలు తెలిపారు. బుధవారం సిద్దిపేటలో బండి నరేష్‌కు నియామక పత్రాన్ని అందించారు.

మల్లన్న ఆలయానికి ఫ్యాన్లు బహూకరణ

కొమురవెల్లి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన ధోనికైన మాధవి సాయిబాబా దంపతులు బుధవారం సుమారు రూ.70 వేల విలువైన 25 సీలింగ్ ఫ్యాన్లను ఆలయాధికారులకు అందించారు.ఈ సందర్భంగా ఆలయాధికారులు స్వామివారి ప్రసాదాలను,అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు.

కార్తీక దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల

సిద్దిపేట కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి శ్రీ సత్య సాయి శతజయంతి వేడుకలు సిద్దిపేటలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సిద్దిపేట పట్టణంలోని శ్రీ భగవాన్ సత్య సాయి సేవా సదనంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు హాజరై భక్తులతో కలిసి దీపోత్సవంలో పాల్గొని దీపాలను వెలిగించారు.

గోపీ గాళ్ల గోవా ట్రిప్ మూవీ టీమ్ సందడి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో గోపిగాళ్ల గోవా ట్రిప్ మూవీ టీమ్ సందడి చేసింది. పట్టణంలోని ఏషియన్ శ్రీనివాస థియేటర్‌లో జరిగిన ప్రత్యేక ప్రదర్శనకు నటీనటులు హాజరయ్యారు. వీరికి ప్రేక్షకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. సినిమాలోని కీలక పాత్రల్లో సిద్దిపేట జిల్లాకు చెందిన అజిత్ మోహన్ రాజు, శివరాత్రి క్యాంపు శశి, గోనం తదితరులు నటించారు.



మూవీ చూస్తున్న చిత్ర బృందం, స్థానికులు